www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 అక్టోబర్ 2024
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

బాలిక మృతి బాధాకరం

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం
దోషులను వదిలే ప్రసక్తే లేదు
వైసిపి అసత్య ప్రచారం శోచనీయం
మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

పుంగనూరులో గత నెల 29న అదృశ్యమైన బాలిక మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూక్ అన్నారు. ఆదివారం పుంగనూరుకు వెళ్లి బాలిక తల్లిదండ్రులను ఓదార్చి, తప్పక న్యాయం చేస్తామన్న హామీ ఇచ్చారు. అక్కడ నుంచి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వెంట ఆయన స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏరోజూ మైనార్టీల పట్ల చిత్తశుద్ధి చూపని జగన్మోహన్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఎన్ని ఆకృత్యాలు జరిగినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పలమనేరులో ఓ బాలికను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ఘటన జరిగినా కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించడానికి కూడా వైసిపి నాయకులు వెళ్లలేదన్నారు. ఏనాడూ బాధిత కుటుంబాలకు రూపాయి ఇవ్వని జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. బాలిక అత్యాచారానికి గురి అవ్వలేదని పోస్టుమార్టం రిపోర్టు, తల్లిదండ్రులు చెబుతున్నా జగన్ మీడియా అసత్య కథనాలతో అందర్నీ పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. వైసిపి రాజకీయం చేస్తోందని మండి పడ్డారు. వైసిపి నాయకులు ఇప్పటికైనా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. బాలిక మృతి సంఘటనలో దోషులెంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కేసు తుది దశకు చేరుకుందని త్వరలోనే నిందితులను అరెస్టు చేసిన కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చట్టపరమైన కఠిన శిక్షలను అమల్లోకి తెస్తామని తెలియజేశారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.తేజస్విని

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గిరిజన విద్యార్థులకు, గిరిజనులకు అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని గిరిజన సంక్షేమ శాఖ అధికారి పప్పు తేజస్విని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో వెనుకబడిన గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వసతి గృహాల విద్యార్థులకు విద్యను, సంక్షేమ పథకాలు ఎలా అందించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆమె వివరించారు.

జిల్లాలో ఎస్‌టి సంక్షేమ వసతి గృహాలు, విద్యార్థులు వివరాలు తెలపండి?

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో అన్నమయ్య జిల్లాకు సంబందించి 5 గిరిజన బాలుర గురుకులం పాఠశాలలలో 557 మంది విద్యార్థులు, 3 గిరిజన బాలికల గురుకులం పాఠశాలలలో 813 మంది , ఒక గిరిజన బాల బాలికల ఆశ్రమ పాఠశాలలో 217 మంది మొత్తం 9 గిరిజన గురుకులం పాఠశాలల్లో 1587 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యనభ్యసిస్తూ, వసతి పొందుతున్నారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని 1 గిరిజన బాలుర కళాశాల వసతిగృహంలో ఏడుగురు బాలురు, రెండు గిరిజన బాలికల కళాశాలల వసతిగృహాలలో 128 మంది బాలికలు మొత్తం 198 మంది విద్యార్థిని, విద్యార్థులు వసతి పొందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా వార్డెన్లు 12 పోస్టులు మంజూరయ్యాయి. అందులో రెగ్యులర్ 8 మంది వార్డెన్లు ఉన్నారు. 04 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా మొత్తం వంటమనుషులు 6 పోస్టులు మంజూరయ్యాయి. అందులో అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ కింద ఆరుగురు పనిచేస్తున్నారు.

జిల్లాలో గిరిజనులు జనాభా ఎంత ?

జిల్లాలో వ్యాప్తంగా గిరిజనులు 67325 మంది ఉన్నారు. ఇందులో స్త్రీలు 32762, పురుషులు 34563 మంది ఉన్నారు. నివాసాలు - 492, ఆవాసాలు, మొత్తం18550 మంది ఉన్నారు.

గిరిజనులకు ఎటువంటి సహాయం అందిస్తున్నారు ?

జిల్లాలో మొత్తం 1785 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. వీరికి పుస్తకాలు, దుస్తులు భోజన వసతి, ఆరోగ్య పరమైన చర్యలు తీసుకుంటున్నాం. 2024-25 సం వత్సరానికి సంబంధించి ఎటువంటి నిధులు మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం నుండి ఇంకా మంజూరు కాలేదు.

గిరిజన పాఠశాలల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గిరిజన పాఠశాలల విద్య మెరుగుదలకు గాను అన్ని పాఠశాలలోఅన్ని సబ్జక్టులకు ఉపాధ్యాయులను నియమించాం. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 275 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాదిలో పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

విద్యార్థుల క్రమం తప్పకుండా రోజూ పాఠశాలకు వెళ్లాలి. పాఠశాలకు హాజరై ఉపాధ్యాయాలు చెప్పిన పాఠలను శ్రద్ధగా విని పరీక్షలలో మంచి మార్కులు సాధించాలి. శుభ్రతను పాటించాలి. వసతి గృహాలలో విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే హాస్టల్ తనిఖీకి వచ్చినప్పుడు విద్యార్థులు తెలియజేయాలి.

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

సమావేశంలో మాట్లాడుతున్న సలీంబాషా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోట్లాది రూపాయలు విలువచేసే వక్ఫ్ బోర్డు ఆస్తులను లక్షలాది ఎకరాల భూములను ముస్లిములకు సంబంధం లేకుండా చేసే సవరణలను జాయింట్ పార్లమెంటరీ కమిటీ అభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా నిర్వహిస్తోందని ఎంపిజె (మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీంబాషా ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో జరిగిన సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే మోడీ ప్రభుత్వం సవరణల పేరుతో కలెక్టర్ల దయాదాక్షిణాలపై ఆధారపడేటట్లుగా సవరణలు తీసుకురావడం బాధాకరంగా ఉందన్నారు. సెప్టెంబర్ 28న ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ హైదరాబాద్‌లో అభిప్రాయ సేకరణలో విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ వక్ఫ్ బోర్డులో సుదీర్ఘకాలం పనిచేసిన షఫీ కుజ్జహాన్ తదితర మత పెద్దలు మాట్లాడుతుండగానే సమయం అయిపోయిందంటూ అసహనాన్ని ప్రదర్శిస్తూ బలవంతంగా ఆపేశారని అన్నారు. దీనిని బట్టి బిజెపి ప్రభుత్వం అనుకున్నదే తడవుగా అమలు పరిచేటట్లుగా ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సలీం బాషాను రాజంపేట మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ గౌస్‌బాషా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, రాజంపేట మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ గౌస్ బాషా, మోసిన్ ఖాన్, ఆదిల్ వాజిద్, సలీం, మహమ్మద్ అబ్బాస్, అఖిల్, షేక్ నిసార్, షబ్బీర్,షేక్ షాహిద్, కరీం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

-ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం కోళ్లబైలు పంచాయతీ, బాబు కాలనీ, జామతోట ప్రాంతాల్లో ప్రజల నుంచి అర్జీల రూపంలో స్వీకరించారు. ప్రజలు కాలనీలలో మురుగునీటి కాలువలు, సిసి రోడ్లు, వీధి దీపాలు లేవని ఎమ్మెల్యేకి విన్నవించారు. సత్వరమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కరించడానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా పట్టణ పరిసర ప్రాంతాలైన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. కాలనీల్లో ఆక్రమణలను పూర్తిగా అరికడతామని వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాటకొండ శ్రీనివాసులునాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం, వేమయ్య, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

కెవిపల్లి మండలం, తీతవగుంటపల్లె గ్రామ సచివాలయంల జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని శిబిరం నిర్వాహకులు తెలిపారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆదివారం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా 108 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేశారు. 34 మంది మహిళలకు గర్భాశయ పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, వైద్యులు, ట్రస్టు సభ్యులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సనాతన ధర్మం అంటే ఏమిటో పవన్ కల్యాణ్ చెప్పాలి

- మాజీ ఎంపీ హర్ష కుమార్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సనాతన ధర్మం అంటే ఏమిటో ఎపిడిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెప్పాలని మాజీ ఎంపీ హర్ష కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలో పాత్యాంశాలు ఉండాలని మీరు కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. మనుధర్మ శాస్త్రాన్ని తీసుకుని రావాలని మీకు విశ్వహిందూ పరిషత్ వారు ఏమైనా నూరిపోశారా అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాదని మనుధర్మ శాస్త్రాన్ని తీసుకుని రావాలని చెప్పి, సనాతన ధర్మమని అంటున్నారా అని పేర్కొన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని హిందువులే ఆచరించారని, సనాతన ధర్మం ఏమితో చెబితే క్లారిటీ ఉంటుందని చెప్పారు. ఇప్పటికి చాలా చోట్ల దేవాలయాల్లోకి దళితులను రానివ్వడం లేదని తెలిపారు. సనాతన ధర్మం, హిందూ ధర్మం అని చెప్పడంలో క్లారిటి కావాలని కోరారు. హిందువు దేవాలయాల్లోకి రానివ్వక పోతే ఏం చర్యలో తీసుకోవాలో పవన్ కల్యాణ్ చెప్పాలన్నారు. సనాతన ధర్మం అని పవన్ కల్యాణ్ ఊగిపోతూ మాట్లాడితే ప్రజలు జోకర్ అనుకుంటారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సిఎంగా ఉండి ఒక మత ప్రచారాకుడి లాగా వేషం వేసుకుని ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం పెద్ద నేరమన్నారు. లడ్డు కల్తీ జరిగింది అనడానికి సాక్ష్యాలు ఏంటని ప్రశ్నించారు. లడ్డు విషయంలో సీట్‌ను సుప్రీం కోర్టు అంగీకరించలేదని తెలిపారు. ప్రజలు పరిపాలన చూస్తారని, 110 రోజుల పరిపాలనలో పెన్షన్లు, అన్న క్యాంటీన్లు తప్ప ఏ పథకాలు లేవన్నారు. 4 నెలలోనే ఫెల్యూర్ ప్రభుత్వంగా ప్రజలు చూస్తున్నారని చెప్పారు. హిందువుల మనోభావాలను రెచ్చగొట్టడానికి వేసిన ప్లాన్ సనాతన ధర్మం అన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - బద్వేలు : విభిన్న ప్రతిభావంతులకు షరుతులు లేని బ్యాంకు రుణాలు ఇప్పించి ఆదుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం గౌరవాధ్యక్షులు కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో విభిన్న ప్రతిభావంతుల పట్టణ స్థాయి ముఖ్యుల సమావేశం ఆదివారం మోర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని విభిన్న ప్రతిభావంతులకు బ్యాంకుల ద్వారా ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేసి వారికి వ్యాపార ఎదుగుదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వారి కుటుంబాలకు భరోసా ఇచ్చేటట్టుగా రుణాలు ఇవ్వాలన్నారు. వికలాంగులు అయినటువంటి నిరు ద్యోగులకు బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి వారి అర్హతకు తగ్గట్టుగా ఉద్యో గాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు.

వేమన తత్వాన్ని ఒడిసి పట్టిన ఆచార్య శివారెడ్డి

- వైవీయూ విసి కృష్ణారెడ్డి

శివారెడ్డిని సన్మానిస్తున్న విసి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

వేమన తత్వాన్ని పరిశీలించి, పరిశోధించి వేమనను శూన్యవాదిగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి ఆచార్య జి. శివారెడ్డి అని వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కడపలో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి. శివారెడ్డి రచించిన 'వేమన పద్యాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ శివారెడ్డి వేమన పద్యాల్లో ఉన్న ఎరుక, బయలు అనే పదాల గురించి బాగా విశ్లేషించి వేమన ఏ మతానికి చెందిన వాడు కాదని అతని తత్వం నాగార్జునని శూన్యవాదానికి దగ్గరగా ఉందని నూతన కోణంలో చెప్పడం విశేషమన్నారు. రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి తన రచనలో కుల వ్యవస్థను వేమన పూర్తిగా వ్యతిరేకించారని, జన్మతా అందరూ శూద్రులేనని, సంస్కారం ద్వారా మాత్రమే బ్రాహ్మణులుగా మారుతారని చెప్పడం ఆయన పరిశీలనా దృష్టికి నిదర్శనమన్నారు. రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి భూమిరెడ్డి స్వరూ పారాణి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి,' కవి 'మామిళ్ళ లోకనాథం, హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయ సంస్థ వైస్ చైర్మన్ కాల్వ సోము కళానా ధరెడ్డి పాల్గొన్నారు.సంస్థ సభ్యులు ఆచార్య జి. శివారెడ్డిని ఘనంగా సన్మానించారు.

బ్రౌన్ గ్రంథాలయ సందర్శన తనివితీరని జిజ్ఞాస

ప్రజాశక్తి-కడప అర్బన్ : సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఎన్నిసార్లు సందర్శించినా తనివితీరని జిజ్ఞాస అనుభూతిని కలిగిస్తుందని విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు ప్రజలకు ఒక గొప్ప విజ్ఞాన సౌధాన్ని అందించి బ్రౌన్‌కు శాశ్వత కీర్తిని ప్రసాదించారన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారులు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. అరుదైన పుస్తకాల్ని నిక్షిప్తం చేసిన విజ్ఞానవంతుల్ని, గ్రంథాలయ సంచాలకులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలి : డివైఎఫ్ఐ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న 15వేల మంది సూపర్ వైజర్లకు, సేల్స్ బాయిలర్లకు, వాచ్‌మెన్లకు ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తెచ్చిన ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేస్తూ ఆర్డినెన్సు తెచ్చిందని పేర్కొన్నారు. దసరా నుంచి కొత్త నూతన మద్యం పాలసి ద్వారా షాపులను ప్రయివేట్ వ్యక్తుల ద్వారా నిర్వహించనుందని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో ఐదేళ్లుగా ఏ ఇతర ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండా ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేశారని చెప్పారు. ఇప్పుడు వారికీ ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా ఉన్న ఫలంగా తీసివేస్తే వారి భవిష్యత్ ఏమిటని ప్రశ్నిస్తున్నమన్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలు, భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ విధానాల పరంగా ఎన్ని అయిన ఉండవచ్చు అని ఇలా నిరుద్యోగుల మీదా కక్ష సాధింపుధోరని చేపట్టడం దారుణమన్నారు. ఇప్పటికే వాలంటీర్లు పరిస్థితి గాలిలో వున్నదని, ఇప్పుడు మద్యం షాపులలో పని చేసే వారి పరిస్థితి అలాగే ఉందన్నారు. డిగ్రీ అర్హతలతో సూపర్‌వైజర్లను, ఇంటర్ అర్హతతో సేల్స్ బాయ్స్‌లను జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఇప్పటికి 15,000 మంది వరకు రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపుల్లో పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. ప్రస్తుత సూపర్వైజర్లకు రూ.19,700, సేల్స్ బాయ్స్‌లకు రూ.16,500 వేతనం ఇస్తున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు పని చేస్తున్నారని, వారిని ప్రభుత్వం గుర్తించి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరు తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం నూతన పాలసీ ప్రకారం ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను దారాదత్తం చేయడానికి సన్నాహాలు చేస్తుందన్నారు. మద్యం వ్యాపారాన్ని ఆదాయం వనరుగ చూడడం సిగ్గుచేటు అన్నారు. గుడి, బడి దగ్గర మద్యం షాపులకు అనుమతించరాదని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. మద్యం దుకాణాలలో పని చేసే వారికి ప్రత్యామ్నాయ మార్గాలను చెప్పి ప్రభుత్వం వారిని, వారి కుటుంబాలను ఆదుకోవాలని, లేని పక్షంలో వారికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాడతామని పేర్కొన్నారు. సమావేశంలో నగర నాయకులు నిర్మల్ పాల్గొన్నారు.

వీడ్కోలు పొందుతున్న జిఎన్‌ఎంలతో డాక్టర్ చంద్రశేఖర్, వైద్య బృందం

అంకితభావంతో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-పీలేరు

వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలను అంకితభావంతో అందివ్వాలని పీలేరు ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ వైద్య సిబ్బందికి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఎన్ఎంలుగా పనిచేస్తూ పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రెండేళ్ల పాటు జిఎన్ఎం శిక్షణ పొందిన 25 మందికి ఆదివారం వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెట్ మాట్లాడుతూ 25 మంది ఎఎన్ఎంలు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జిఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్నారని అన్నారు. అలాగే వారు శిక్షణలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు తమ అమూల్య సేవలను కూడా అందించారని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరిని సచివాలయాల్లో తిరిగి వీధుల్లో చేరడానికి వీలుగా రిలీవ్ చేశామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వైద్య సిబ్బందిని దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించి వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ నాగవేణి, డాక్టర్ శ్రీలత, హెడ్ నర్స్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువత

- అభాగ్యుడికి ఆపన్న హస్తం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2000 సంవత్సరం బ్యాచ్ కు చెందిన యువత నిస్సహాయుడికి సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ప్రజాశక్తి దినపత్రికలో ' ఆపన్న హస్తం కోసం అభాగ్యుల ఎదురుచూపు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. నాలుగు నెలలుగా మంచానికే పరిమిత్తమైన సిద్ధం పెంచలయ్యను బిఎస్ థియేటర్ సమీపంలోని వారి ఇంటివద్దకు వెళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000 సంవత్సరం బ్యాచ్ యువకులు పరామర్శించి ఆదివారం నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రబృందం సహకారంతో ఈ సహాయం చేయగలిగామని తెలిపారు. కుటుంబ యజమాని మంచాన పడి నా అనేవారు లేక పూట గడవడానికి కూడా కష్టంగా ఉన్న సిద్ధం పెంచలయ్య కుటుంబాన్ని దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెంచలయ్య భార్య నాగమణి మాట్లాడుతూ తమ ఇంటి యజమాని మంచాన పడటంతో ఒక్కసారిగా కుటుంబం రోడ్డున పడిందని, తమకు సంతానం కూడా లేకపోవడంతో చూసే దిక్కు లేక అలమటిస్తున్నామని అన్నారు. దాతలు ఎవరైనా తమను ఆదుకో వాలని కోరారు. కార్యక్రమంలో యువకులు శివయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సునీల్, టైలర్ శివ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న యువకులు

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రీడలకు 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో ఎంపికైనట్లు కళాశాల పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు అండర్-19 తేక్వాండో క్రీడ పోటీలు రైల్వే కోడూరు జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లాస్థాయి తేక్వాండో పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భార్గవి, పదవ తరగతి విద్యార్థి లహరి రజత పతకం, తేజస్విని కాంస్య పతకం సాధించారని అన్నారు. అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ అండర్-19 సెక్రటరీ శారద, ఆర్ఎస్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు రవిశం కర్‌రాజు, కోచ్ మానస గణేష్ పాల్గొన్నారు.

హైజంప్ పోటీకి బాలు..

బి.కొత్తకోట: తిరుపతిలో జరిగిన అండర్ -19 హై జంప్ సెలక్షన్లలో బి.కొత్తకోట ఆదర్శ పాఠశాల విద్యార్థి పి.బాలు మూడో స్థానం నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకి ఎంపికయ్యారు. అండర్-17 సెటిల్ సెలక్షన్లో నిత్య సాయిశ్రీ అండర్ -14లో హారణి,అల్మాస్ జిల్లా స్థాయి పోటీలకి సెలెక్ట్ అయ్యారు.రాష్ట్రస్థాయి మరియు జిల్లా స్థాయికి ఎన్నికైనటువంటి విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనాయక్ మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు సుధీర్ కుమార్ అభి నందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో ప్రభుత్వం, ఇతర రంగాలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులు 20 లక్షలకు పైగా ఉన్నారని, వీరందరికీ సమగ్ర సంక్షేమ చట్టం అమలుపరచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డి.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డు నందు గల షాదీ మహల్‌లో మండల కమిటీ సర్వసభ్య సమావేశం, యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు ఎం.అష్రఫ్ అలీ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.డి.రవి మాట్లాడుతూ రెక్కాడితేగాని డొక్కాడని హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చాలా అవసరం ఉందన్నారు. ఈచట్టం అమలు జరిగితే కార్మికులకు పెన్షన్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పిల్లల చదువుకు ఆర్థిక సాయం, పక్కా గృహాలు, రేషన్ కార్డులు తదితర సౌకర్యాలు లభిస్తాయని అన్నారు. కార్య క్రమంలో మండల అధ్యక్షులు ఎస్.తంబయ్య శెట్టి, ఎం.అష్రఫ్‌అలీ, రామానుజులు పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్‌ను అందిస్తున్న శ్రీనివాసులు

ఉన్నత పాఠశాలకు మినీ ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మండలానికి చెందిన శ్రీనివాసులు మినీ ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను వితరణగా అందించారు. మండలంలోని కోటాల పంచాయతీ జరిగిపాటివెన్నకు చెందిన దాత శ్రీనివాసులు, 25 వేల రూపాయలు విలువగల మినీ ఆర్ఓవాటర్ ప్లాంట్ ను పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ సుగుణ వాసి శివకుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులకు అందజేశారు. ఆర్ఓ ప్లాంట్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో నీటి శుద్ధి యంత్రాన్ని పాఠశాలకు అందించినట్లు ఆయన తెలిపారు. దాతదాతృత్వాన్ని చాటుకున్న శ్రీనివాసులను ఎస్ఎంసి చైర్మన్ సుగుణ వాసి శివకుమార్,హెచ్ఎం శ్రీనివాసులు అభినందించారు.

'కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తున్నాయి'

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తున్నాయని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే దేశంలోని కర్నాటక, తెలంగాణా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉందన్నారు. 6 రాష్ట్రాల్లో ఇండియా కూటమి అధికారంలో ఉందన్నారు. 2019లో కాంగ్రెస్ 52 లోక్‌సభ స్థానాలలో గెలవగా 2024లో 99 స్థానాలలో గెలిచిందన్నారు. ఇటీవల జరిగిన హరియానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ ప్రకారం కాంగ్రెస్ మంచి మెజారిటీతో అధికారంలోకి రాబోతున్నట్లు చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కలిసి కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెసు పుంజుకుంటోందన్నారు. టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం పరిస్థితి పెనం మీద నుండి భగభగ మండే నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని విమర్శించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, షర్మిల ముఖ్యమంత్రి కావడం, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని తులసిరెడ్డి తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కార్యకర్తల సమా వేశం సోమవారం మధ్యాహ్నం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరుగు తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాముల బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. ఆ మేరకు స్థానిక బిఆర్ లాడ్జిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సమా వేశానికి మాజీ రాజ్యసభ సభ్యులు ఎన్. తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి హాజరవుతారన్నారు. కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన పోస్టల్ జిడిఎస్ ఎంప్లాయీస్ ఉద్యోగులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిని పులివెందుల పోస్టల్ జిడిఎస్ ఎంప్లాయీస్ ఉద్యోగులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు వారాల క్రితం ఆయనను కలిసి పోస్టల్ శాఖలో జిడిఎస్ (గ్రామీణ డాక్ సేవక్) ఎంప్లాయీస్ ఉద్యోగోన్నతి సమస్యను వివరించామన్నారు. ఆ మేరకు మంత్రి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పోస్టల్ శాఖలో గ్రామీణ డాక్ సేవకలుగా పని చేస్తూ ఉద్యోగోన్నతి కోసం 2022, 2023లో 2 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాశారని, అయితే ఏపీలో ఖాళీలు లేనందున తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని తెలిపారు. ఢిల్లీలో 3600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు 11 నెలల క్రితం వినతిపత్రం అందించామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పెమ్మసాని దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యపై పెమ్మసాని స్పందిస్తూ ఢిల్లీ అధికారులతో చర్చించి మూడు వారాల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నెరవేర్చినందుకు ఆయనకు వరుణ్, వంశీ, నవీన్, కుల్లాయిశెట్టి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

ఆశాజనకంగా వరి సాగు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో కుందూ, పెన్నా నది, కెసి కాలువ పరివాహక గ్రామాలతోపాటు బోరుబావుల కింద ఖరీఫ్‌లో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 13,527 ఎకరాల్లో వరి పంట సాగైనట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండల పరిధిలో నాగులపల్లె, చాపాడు, సీతారామపురం, అనంతపురం, రాజు వారిపేట, అయ్యవారిపల్లె, చియ్యపాడు, మొర్రాయపల్లె, సోమాపురం, సిద్దారెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలో వరి పంట సాగు చేపట్టారు. ప్రస్తుతం గత ఏడాది సాగుచేసిన వరి ధాన్యం విలువ కూడా బాగా పెరి గాయని రైతులు పేర్కొంటున్నారు. జగిత్యాల రకం 8 బస్తాల ధర రూ.22వేలకుపైగా పలుకుతున్నాయని రైతులు తెలిపారు. గత ఏడాది వరి పంట నూర్పిడి చేసిన సమయంలో 8 బస్తాల వరి ధాన్యం విలువ రూ.14వేలలోపు మాత్రమే ఉండేది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం నిలువ ఉంచుకున్న రైతులకు మాత్రం ప్రస్తుతం రూ.పది మిగిలే పరిస్థితి కనబడుతోంది. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండవ దపా సత్తువ వేసి, కలుపులు తీస్తున్నారు.

సోమాపురం వద్ద సాగులో ఉన్న వరి పంట

వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

అన్నపూర్ణదేవి అలంకారంలో రెడ్డెమ్మ

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చ కులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బెంగుళూరుకు చెందిన సరిత, శ్రీనివాసరెడ్డి ఉభయ దారు లుగా వ్యవహరిం చారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు, భోజన వసతి కల్పించారు. ఐదవ రోజు అమ్మవారు శ్రీ మహా లక్ష్మీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు. **నందలూరు:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు కృష్ణమూర్తి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమే శ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్‌శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహ స్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహశ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్ల వీరగంగాభవాని అమ్మవారు వారాహీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మూగాంభికాదేవిగా, గొల్లపల్లిలోని విరూపాక్షమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా, చింతపర్తి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గమ్మగా, గండబోయనపల్లి శ్రీ సత్యమ్మ తల్లి లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పూజారులు జనార్ధన్, ఉత్తన్న, వరదరాజు, అర్చకులు గోనవరపు శీనాస్వామి, సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

వారపు సంత కేంద్రంగా ఫోన్ల చోరీలు

- సంతకు రావాలంటే హడలుతున్న సామాన్యులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతలో మొబైల్ ఫోన్లు చోరీలు జరుగుతుండడంతో సామాన్యులు హడలిపోతున్నారు. వారపు సంత పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ.. మొబైల్, పర్సులు చోరీకి గురవుతున్నాయి. ఆదివారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయలు కొనడానికి వచ్చిన హరి నాథ్‌రెడ్డి, బాదుల్ పీరా అనే వ్యక్తులకు సంబంధించిన విలువైన స్మార్ట్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు..

మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న వారపు సంత జరిగే ప్రదేశంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. వారపు సంతకు అనేక గ్రామాల నుంచి దాదాపు మూడు నుంచి 5 వేల మంది ప్రజలు వస్తుంటారు. మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు సైతం తమ దిగుబడులను విక్రయిస్తుంటారు. అధికారులు వారపు సంతలో వ్యాపారస్తుల నుంచి గేటు వసూలు చేస్తున్నప్పటికీ సదుపాయాల కల్పనలో మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సింహాద్రిపురంలో ఆదివారం నిర్వహించిన వారపు సంత

రైతుకు పెట్టుబడి సాయం మంజూరు చేయాలి

- వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు

ప్రజాశక్తి - జమ్మలమడుగురూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రూ.20వేలు వెంటనే మంజూరు చేయాలని వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు కోరారు. ఆదివారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రెండో విడత సాయంగా ప్రతి రైతుకు రూ.2000 జమ చేసిందన్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఎప్పు డు చూసినా రాష్ట్రంలో డైవర్ట్ పాలిటిక్స్ నడుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులకు ఆర్థికసాయంగా వారికి మీరు ఇస్తానన్న రూ.20వేలు వెం టనే మంజూరు చేయాలని, లేనిపక్షంలో మీరు రైతులకు సమాధానం చెప్పాలన్నారు.

రాయితీతో శనగలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీ సాగుకు సంబంధించి మండలానికి 1,078 క్వింటాళ్ల శనగలు మంజూరైనట్లు ఆదివారం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. శనగలు 25శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు సోమవారం నుంచి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. బయోమెట్రిక్ పద్ధతిల్లో డి క్రిష్ యాప్ ద్వారా మాత్రమే శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకురావాలని ఎఒ కోరారు.

ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని సాయి శ్రీనగర్, సాయికృప నగర్, సాయికృప ఎన్‌క్లేవ్‌లపై కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని సదరు లే అవుట్ల భాగస్వామ్యుల్లో ఒకరైన శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమన్నారు. సదరు వ్యక్తి 2005లో సాయికృప నగర్‌లో ఆయన సతీమణి పేరు మీద మూడు ప్లాట్లు కొనుగోలు చేసి మళ్లీ 2021లో అధిక ధరలకు అమ్ముకున్నాడని, కొనుగోలు, అమ్మకం జరిపి నేడు సదరు వెంచర్లపై అవాస్తవాలు మాట్లాడడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గతంలో శివారెడ్డి అనే వ్యక్తికి మహేశ్వర్ రెడ్డికి ఉన్న వ్యక్తిగత కారణాల దృష్ట్యా నేడు తమ వెంచర్లపై దుష్ప్రచారం మొదలుపెట్టాడని ఆరోపించారు. 2005లో తమకు పంచాయతీ నుండి అనుమతులు లభించాయన్నారు. నాడు పంచాయతీ అధికారులు లే అవుట్లకు పాటించాల్సిన నియమ నిబంధనలు తమకు పూర్తిగా తెలుపలేదని, దీన్ని ఆసరా చేసుకున్న మహేశ్వర్‌రెడ్డి తమపై ఆరోపణలు గుప్పిస్తున్నారన్నారు. కొత్తపల్లి పంచాయతీ పరిధిలో కేవలం శివారెడ్డి వెంచర్లు మాత్రమే ఉన్నాయా అంటూ ఇవి మహేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించారు.

వైఎస్ఆర్ జిల్లా పేరును కొనసాగించాల్సిందే

ప్రజాశక్తి - ఖాజీపేట

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గౌరవ సూచికంగా జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా నాటి ప్రభుత్వాలు మార్చితే, ఆ విషయాన్ని రాజకీయం చేస్తూ మళ్లీ కడప జిల్లాగా మార్చాలని మాట్లాడటం నీచం, సహేయకమని వైసిపి నేత, ఎపిఎస్ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దుంపలగట్టులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం కోసం అహర్నిశలు పాటు పడిన ఎన్టీఆర్ పుట్టినగడ్డ కృష్ణాజిల్లాను ఎన్టీఆర్ జిల్లాగా మార్చి తన పెద్ద మనసును చాటుకున్నారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా పేరును అలాగే కొనసాగించాల్సిందేనని, లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని రెడ్యం తెలిపారు.

కెసి ప్రధాన కాలువకు తగ్గిన నీటి సరఫరా

ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు (కెసి) ప్రధాన కాలువకు అధికారులు నీటిని తగ్గించారు. ఎగువ ప్రాంతంలో కెసి కాలువలో వ్యక్తి గల్లంతైనట్లు ఫిర్యాదు రావడంతో అధికారులు రాజోలి ఆనకట్ట వద్ద నీటిని తగ్గించారు. ప్రస్తుతం కెసి కాలువలో 100 క్యూసెక్కులలోపు మాత్రమే నీరు ప్రవహిస్తోంది. గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియగానే మళ్లీ నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కెసి కాలువలో మూడు రోజుల క్రితం మైదుకూరులో కూడా ఇద్దరు చిన్నపిల్లలు గల్లంతై మృతి చెందిన సంఘటన తెలిసిందే. కెసి కాలువలో అధిక నీరు ప్రవహిస్తుండడంతో కొంతమంది ప్రమాదవశాత్తూ నీటిలో పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

మైలేజ్ వాహనం రావడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

అతి తక్కువ ఖర్చుతోపాటు గ్యాస్, పెట్రోల్‌తో నడిచే వాహనం వేంపల్లె యువతకు అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న ఆయాన్ బజాజ్ షోరూంలో ఆదివారం గ్యాస్, పెట్రోల్‌తో నడిచే సిఎన్ జి బజాజ్ ఫ్రీడం మోటర్ బైకును తులసిరెడ్డి అట్టహాసంగా అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీతో తయారైన వాహనాలను యువతకు అందుబాటులోకి తెచ్చిన బజాజ్ షోరూం అథరైజ్డ్ సర్వీసింగ్ సెంటర్ ఎండి డాక్టర్ ఇబ్రహీంను అభినం దిం చారు. ప్రపంచపు మొట్టమొదటి సిఎన్ జికి చెందిన పెట్రోలు, గ్యాస్‌కు చెం దిన 125 సిసి ఫ్రీడం వాహనామని ఎండి డాక్టర్ ఇబ్రహీం అన్నారు. రెండు లీటర్ల పెట్రోలుతో 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు అన్నారు. సిఎన్ జి గ్యాస్‌ను 2కిలోలు నింపితే 204 కిలోమీటర్లు వరకు ప్రయాణం చేయవచ్చునని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయడానికి వీలుందని తెలిపారు. మోటర్ బైకుకు మొబైల్ ఛార్జింగ్ సౌకర్యం కూడా ఉందన్నారు. అనంతరం తులసిరెడ్డిని అయాన్ బజాజ్ షోరూం అధినేత డాక్టర్ ఇబ్రహీం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అబ్దుల్, మాజీ మండల కో-ఆప్షన్ మెంబరు మటన్ బాబా, వేమా నాగరాజా, పిఎస్ కరీముల్లా, ఉత్తన్న, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

వీధులు ఇలా.. నడక సాగించేది ఎలా..!

ప్రజాశక్తి - ఖాజీపేట : మండలం పరిధిలోని పుల్లూరు పంచాయతీ సర్వర్‌ఖాన్ పేట సమస్యలతో కొట్టుమిట్టడుతోంది. గ్రామంలో ప్రధానంగా పారిశుధ్యం సమస్య వేధిస్తోంది. చిన్నపాటి వర్షం వస్తే వీధులన్ని చెరువులను తల పిస్తుంటాయి. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం వల్ల స్థానికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు బయటకు వెళ్లడానికి సరైన డ్రయినేజీ వ్యవస్థ లేదు. వివరాల్లోకి వెళ్తే.. సర్వర్‌ఖాన్ పేట మసీద్ పక్క వీధి నుంచి ఉర్దూ పాఠశాల మీదుగా శ్మశానానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి వీదుల్లో మోకాలి లోతు వరుకు నీరు వచ్చి చేరుతుంటుంది. ముఖ్యంగా ఉర్దూ పాఠశాల వద్ద మురుగు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యా ర్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నీరు నిల్వ కారణంగా పరిసరాలు అపరిశుభ్రంతోపాటు వ్యాధులు ప్రబలే ఆస్కారం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బలపనూరు వంతెన

ప్రజాశక్తి - సింహాద్రిపురం: సింహాద్రిపురం-పులివెందుల ప్రధాన రహదారి బలపనూరు సమీపంలో వంతెనకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉంది. ఆదిమరిస్తే అంతే సంగతులు అనే విధంగా ఉండడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారులు పలుమార్లు పరిశీలించినప్పటికీ వంతెన రక్షణ గోడల నిర్మాణానికి నోచుకోలేదు. ప్రధాన రహదారిలో ఉన్నా ఈ వంతెన పట్ల అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అంటూ వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

పింఛనుదారులకు బిసిజి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కలికిరి

పెన్షనర్లు వయోభారం లేకుండా ఆరోగ్యం పై దృష్టి పెట్టి నిరంతరం ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలని నేషనల్ సంఘం డైరెక్టర్ వై.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం కలికిరి లోని షాదీ మహల్‌లో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ మేడికుర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 30 మందికి వయోజన బిసిజి టీకాలు వేయించినట్లు తెలిపారు. పెన్షనర్లకు ఎఆర్, డిఎ ఇవ్వాలని కోరారు. అదనపు క్వాంటం 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని పేర్కొన్నారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ రాబోయే నెలలో ఉచిత కంటి వైద్య శిబికరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుబ్బరాజు శెట్టి, సి ఆదినారాయణ, బి.వెంకటరమణ, ఎం దేవేంద్ర కె బసవయ్య, ఇసి.వెంకటస్వామి, సి.సత్యనారాయణ, టి.సరోజమ్మ, ఎం కాంతమ్మ, జి.జయరాం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సుధాకర్

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.6.93 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట డిఎస్‌పి సుధాకర్ తెలిపారు. ఆదివారం రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణం కృష్ణానగర్ లో నివాసమున్న అధ్యాపకుడు కొప్పు నాగరాజు ఇంటిలో చోరీ జరిగిందన్నారు. ఈ చోరీకి సంబంధించి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.ఎస్‌పి విద్యాసాగర్ నాయకుడు ఆదేశాల మేరకు తన ఆధ్వర్యంలో సిఐ కె.యల్లమరాజు, ఎస్ఐలు వి.నాగేశ్వరరావు, వివిఎల్.ప్రసాద్‌రెడ్డిలు తమ సిబ్బందితో ఒక టీంగా ఏర్పాటు చేశామన్నారు. చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించి అక్కడ లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పల్లంపేటకు చెందిన వేములపల్లి విజయ్‌కుమార్ అనే నిందితుడిని శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాజంపేట పట్టణం రైల్వేబ్రిడ్జి కింద పట్టుకొని దొంగలించిన సొత్తు అంతా రికవరీ చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుండి రూ. 6.93 లక్షలు విలువ చేసే 138.76 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.9,650లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫిర్యాదుదారుడు కొప్పు నాగరాజు తన ఇంటి గ్రిల్ డోర్ తాళం వేసి, తాళాలను ఇంట్లోని సోఫా పైన కనపడే విధంగా వుంచడంతో పాటు బీరువాకు తాళాలు వేసి తాళాలు తన ప్యాంట్ లోవేసుకొని తన డూప్లెక్స్ హౌస్ లోని మొదటి అంతస్థులో నిద్రించాడని చెప్పారు. నిందితుడు కిటికీలోని ఆ తాళాలను తీసుకొని, తాళాల సహాయంతోనే ఇంటి తాళాలు తీసి దొంగతనం చేశాడని తెలిపారు. వివిధ పోలీసు స్టేషన్ లలో విజయ్‌కుమార్‌పై 44 దొంగతనాల కేసులు నమోదు అయ్యాయని ఎలిపారు. కొన్ని కేసుల్లో శిక్షపడగా, మరికొన్ని కేసులు ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఎవరికి దొరకకుండా రాత్రి వేళల్లో రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ఇళ్లలో దొంగతనాలు పాల్పడుతున్నాడని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ఈ దొంగతనంతో పాటు సామర్లకోట పోలీసుస్టేషన్ పరిధిలో 3 దొంగతనాలు, రాజమండ్రి పోలీసు స్టేషన్ పరిధిలో 2, అనపర్తి పోలీసు స్టేషన్ పరిధిలో 2, తాడేపల్లె గూడెం పోలీసు స్టేషన్‌లో 2, తణుకు పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి, ద్వారకా తిరుమల పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి దొంగతనాలు చేశాడని తెలిపారు. రెండేళ్లలో 11 దొంగతనాలకు పాల్పడ్డా రన్నారు. ప్రజలు వీలైనంతవరకు వారి ఇళ్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు పోలీసు వారికి సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో పోలీసు పెట్రోలింగ్ ద్వారా నిఘా వుంచుతామని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి దొంగతనం కేసును చేధించిన పోలీసు సిబ్బందిని అభినందించారని డిఎస్‌పి తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : గుర్తు తెలియని వాహనం ఢీకొని బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపిన మేరకు.. మండలంలోని కుక్కరాజుపల్లి పంచాయతీ, మంకువారిపల్లెకు ఏడాది క్రితం బీహార్ రాష్ట్రం నుంచి పదిమంది బతుకుతెరువు కోసం వచ్చి స్థిరపడ్డారని స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఫిరోజ్ అన్సారి సొంతపనిమీద బైకులో గుర్రంకొండకు బయలుదేరారని అన్నారు. మార్గ మధ్యంలోని కుమ్మరపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని అన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు..

ప్రజాశక్తి-కలకడ : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పీలేరు వైపు నుంచి వస్తున్న ఆటోను కలకడ వైపు నుంచి వేలూరుకి చీనీకాలికి వెళుతున్న ఐచర్ వాహనం ఆటోను ఢీ కొట్టిందని అన్నారు. ఈ ప్రమాదంలో గాలివీడు మండలం నూలివీడుకు సమీపంలో ఉన్న కొండ్రెడ్డిగారి పల్లికు చెందిన ఆటో డ్రైవర్ శబరీష్ ఎడమ కాలికి రక్త గాయం కాగా, ఎడమ చెవిలో రక్తం వస్తున్నట్లు తెలిపారు. బాధితుడిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లి : నిషేధిత నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని బుగ్గ కాలవలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అందిందన్నారు. తన సిబ్బందితో వెళ్లి సారా విక్రయిస్తున్న బాలాజీ నాయక్ ఇంటిలో సోదాలు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బిత్ర వెంకటస్వామి (66) ఆదివారం చెట్టుకి ఊరి వేసుకొని మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ వివరాల మేరకు.. వెంకటస్వామికి భార్య చంగమ్మ, కుమార్తె ఉన్నారని తెలిపారు. మృతుడు మద్యానికి బానిస అయ్యాడని నిరంతరం భార్య, కూతురిని వేధించుకొని డబ్బులు తీసుకొని మద్యం సేవించేవాడని తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు మద్యం కోసం మృతుడు నిరంతరం కుటుంబ సభ్యులను గొడవపడేవారని అన్నారు. మద్యం మత్తులో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.